ముగ్గురికీ భంగపాటు

- షాక్ నుంచి తేరుకోని వైనం
- నిన్నగాక మొన్న పార్టీలో చేరిన వంశీకి టికెట్ కేటాయింపుపై అసంతృప్తి
- పవన్ కల్యాణ్‌ను నమ్మి తప్పు చేశామని ఆవేదన



సాధిక్ ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయం



కందుల నాగరాజు ఇంటి ప్రాంగణం నుంచి బయటకురాని జనసేన ప్రచార రథాలు

డాబాగార్డెన్స్ : ఆ ముగ్గురు దక్షిణ నియోజకవర్గంలో పోటాపోటీగా జనసేన పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. డబ్బులూ బాగానే ఖర్చు చేశారు. పవన్ విశాఖ వచ్చినప్పుడల్లా చేతిచమురు వదిలించుకున్నారు. ఎవరికి వారు దక్షిణ టికెట్‌ను ఆశించారు. అనుచరుల వద్ద దక్షిణ అసెంబ్లీ టికెట్ తనకే వస్తుందని, మీరంతా సహకరించాలని సమావేశాలూ ఏర్పాటు చేసుకున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూడా ఈ ముగ్గురికీ ప్రాధాన్యత ఇస్తూ ఆశలు రేకెత్తించారు. కట్ చేస్తే ఆ ముగ్గురికి పవన్ ఝలక్ ఇచ్చాడు. ఆ షాక్ నుంచి ఇంకా ఆ ముగ్గురు తేరుకోలేదు. ఒకరు ఇంట్లో నుంచి బయటకు రావడం లేదు..మరొకరు ఎందుకు పార్టీ మారారో అర్థం కాని పరిస్థితిలో ఉన్నాడు. మరొకరు పవన్ నమ్ముకుని తప్పు చేశానని మథన పడుతున్నాడు. దక్షిణంలో గ్లాసును నమ్ముకుని ముక్కచెక్కలైన తమ రాజకీయ భవిష్యత్తును తలుచుకుని కుమిలిపోతున్నారు.

'మూగి' సైలెంట్

మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ మూగి శ్రీనివాసరావు జనసేన పార్టీ స్థాపించిన దగ్గరనుంచీ ఉన్నారు. దక్షిణ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో సత్సంబంధాలూ ఉన్నాయి. నియోజకవర్గంలో మత్స్యకార సామాజిక వర్గం బలంగా ఉండడంతో కచ్చితంగా తనకే సీటు వస్తుందని మూగి శ్రీనివాసరావు ఆశించారు. అయితే ఇటీవల పార్టీలో చేరిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు దక్షిణ టికెట్ కేటాయించడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన తనను పవన్ ఇంత మోసం చేస్తాడనుకోలేదని తన అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది.

బయటకురాని 'కందుల'

ఇక ఆరు నెలల క్రితం జనసేనలో చేరిన స్వతంత్ర కార్పొరేటర్ కందుల నాగరాజు బాగానే డబ్బులు ఖర్చు చేశాడు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రోజుకో వార్డులో పర్యటించారు. పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిన ఆయన దక్షిణ టికెట్ ఆశించారు. టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేశాడు. పవన్ విశాఖలో ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా కందుల నాగరాజు భారీగా డబ్బులు ఖర్చు చేసి జనసమీకరణ చేసేవారు. దక్షిణ టికెట్ తనకే ఖరారైందని ప్రచారం కూడా మొదలు పెట్టాడు. కట్ చేస్తే సీన్ తారుమారైంది. నిన్నగాక మొన్న పార్టీలో చేరిన వంశీకృష్ణకు టికెట్ కేటాయించడంతో కందుల నాగరాజు ఇంటినుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. తన ప్రచార రథాలను సైతం ఇంట్లో పార్కింగ్‌కే పరిమితమయ్యాయి. పవన్ నమ్ముకున్నందుకు లోలోన మథనపడుతున్నాడు.

భంగపడ్డ 'సాధిక్'

విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధి లక్ష్మీటాకీస్ జంక్షన్ వద్ద 39వ వార్డు స్వతంత్ర కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అందరికన్నా ముందుగానే పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అదీ కూడా పవన్ సోదరుడు నాగబాబు చేతుల మీదుగా అట్టహాసంగా కార్యాలయం ప్రారంభించారు. దక్షిణ టికెట్ తనకే వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తీరా వంశీకృష్ణకు సీటు ఇవ్వడంతో ఖంగుతిన్నాడు. ఆయన కార్యాలయానికి తాళాలు తీయడం లేదు. చివరకు జనసేన పార్టీ ముస్లిం సామాజిక వర్గాన్ని కూడా నిర్లక్ష్యం చేసింది.

వాసుపల్లికి వెల్లువెత్తుతున్న మద్దతు



వైఎస్సార్ సీపీలో చేరిన జబ్బరతోటకు చెందిన జనసేన యువకులు, మహిళలతో వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. ఇప్పటికే జనసేన పార్టీ నుంచి యువకులు, మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన కుల సంఘాలు, మహిళా సంఘాలు మద్దతు తెలుపుతూ పార్టీలో చేరాయి. ఇదిలా ఉండగా ఆదివారం 37వ వార్డు జబ్బరతోటకి చెందిన పలువురు జనసేన యువకులు, మహిళలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ వార్డు నాయకుడు నొల్లు పోతుస్వామి ఆధ్వర్యంలో చేరిన వారికి వాసుపల్లి గణేష్‌కుమార్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కూటమి బూటకపు మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. దక్షిణ నియోజకవర్గంలో అన్ని వార్డుల నుంచి తెలుగుదేశం, జనసేన పార్టీ నుంచి భారీగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, వార్డు నాయకుడు నొల్లు చంటి పాల్గొన్నారు.

ప్రాణభిక్ష పెట్టారు.. : వాసుపల్లి గణేష్‌కుమార్ నాకు ప్రాణభిక్ష పెట్టారు. వాసుపల్లిని గెలిపించుకోవడం నా బాధ్యత అంటూ 38వ వార్డు పార్టీ నాయకుడు గురజాపు రవి వివిధ పార్టీలకు చెందిన పలువుర్ని వైఎస్సార్ సీపీలో చేర్చారు. వాసుపల్లి కార్యాలయంలో ఆదివారం 38వ వార్డు సోల్జర్‌పేటకు చెందిన 50 మందికి పైగా యువకుల్ని వాసుపల్లి సమక్షంలో పార్టీలో చేర్పించారు. ఈ సందర్భంగా గురజాపు రవి మాట్లాడుతూ కరోనా విపత్కర సమయంలో దేవుడిలా వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదుకొని ప్రాణభిక్ష పెట్టారన్నారు. ఏ కష్టం వచ్చినా అండగా నిలబడే మా నాయకుడ్ని అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.



వాసుపల్లి సమక్షంలో పార్టీలో చేరిన 38వ వార్డు సోల్జర్‌పేటకు చెందిన యువకులు



ప్రచారంలో భాగంగా 34వ వార్డులో టీ కొట్టులో టీ తాగుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

క్లుప్తంగా

పలువురికి సత్కారం



కార్మిక నాయకుడు డీకే శర్మను సత్కరిస్తున్న గీతా మకరందం సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్: గీతా మకరందం సంస్థ ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 39వ వార్డు ఎంవీఆర్ చౌల్ట్రీలో ఆదివారం పలువురు మాతృమూర్తులను సత్కరించింది. ప్రముఖ కార్మిక నాయకుడు, హెచ్‌ఎంఎస్ యూనియన్ నేత డీకే శర్మను డాక్ లేబర్ బోర్డు అండ్ విశాఖ పట్నం పోర్టు అథారిటీ కార్మికులు(గీతా మకరందం సభ్యులు) సత్కరించారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు మాతృమూర్తులను ప్రతి ఏటా సత్కరించుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్మి కులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ



కార్యకర్త రాంప్రసాద్ తల్లిని పరామర్శిస్తున్న వాసుపల్లి గణేష్ కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డు జబ్బర్ తోటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రాంప్రసాద్ కుటుంబాన్ని ఆదివారం వాసుపల్లి గణేష్‌కుమార్ పరామర్శించారు. వార్డు నాయకుడు నొల్లు పోతుస్వామి ద్వారా విషయం తెలుసుకోని ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. ఆమె హార్ట్ బ్రీత్ సమస్యతో బాధపడతున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. తన విజయానికి ఎల్లప్పుడూ తోడుగా ఉండే కార్యకర్తలకు అండగా నిలబడడం తన బాధ్యతని వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు.


35వ వార్డులో విస్తృత ప్రచారం



పండావీధిలో ప్రచారం చేస్తున్న కనకరెడ్డి

జగదాంబ: వైఎస్సార్‌సీపీకి అత్యంత ప్రజాదారణ లభిస్తోందని జీవీఎంసీ 35వ వార్డు అధ్యక్షుడు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించాలని ఆదివారం పండావీధి, ప్రసాద్ గార్డెన్స్, పూలసందు, నూనెమిల్లవీధి, బౌడారారోడ్డు, మంచాలవీధి, చినదుర్గాలమ్మవీధి, కల్లుపాకలు, గాజులవీధి, వెలంపేట, లక్ష్మీనగరలో విస్తృ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని ప్రజలకు కనకరెడ్డి వివరించారు. వచ్చే ఎన్నికల్లో వాసుపల్లిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆదివిష్ణురెడ్డి, సుబ్రహ్మణ్యం, పుష్ప, రమణమ్మ, గంగాధర్, రూప, నాగిరెడ్డి, రమణ పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో పన్నుల వసూలు



రూ.50 లక్షల చెక్కును జెడ్సీ ప్రసాదరావుకు అందిస్తున్న ఆర్‌ఐ సీతారామ్

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లయ్యాయని జెడ్సీ పీవీవీ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ జోన్–4 పరిధిలో 50,823 అసెస్‌మెంట్స్ ఉన్నాయన్నారు. జీవీఎంసీ కార్పొరేషన్ ఆస్తి, నీటి పన్నుల చెల్లింపుల్లో వడ్డీ మాఫీ చేయడంతో ప్రజల నుంచి స్పందన వచ్చిందన్నారు. కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు జోన్–4 రెవెన్యూ, సెక్రెటరీలతో కలిసి పన్నులు వసూలు చేశామన్నారు. గత ఏడాది కంటే ఈఏడాది పన్నులు అధిక మొత్తంలో వసూలు చేశామన్నారు. పన్ను చెల్లింపులకు ఆదివారం ఆఖరు రోజు కావడం రాత్రి 8 గంటల వరకు సిబ్బంది పని చేశారన్నారు. దీంతో ఈఏడాది ఆస్తిపన్ను, నీటి పన్నులు కలిపి రూ.48 కోట్లకు పైగా వసూల్ చేశామని జోనల్ కమిషనర్ ప్రసాదరావు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో వాసుపల్లి గణేష్‌కుమార్, విజయలక్ష్మి తదితరులు



పార్టీలోకి మహిళలను ఆహ్వానిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్



వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డుకు చెందిన ఆర్యవైశ్యులు, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బోరా విజయలక్ష్మి, బోరా శ్రీనివాసరెడ్డి, బల్లిగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఆదారి వెంకట మహేష్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఆశీలమెట్టదరి వాసుపల్లి గణేష్‌కుమార్ కార్యాలయంలో ఘంటసాల నాగేంద్రకుమార్, నాగలక్ష్మి దంపతులతో పాటు వంద మందిని పార్టీలోకి వాసుపల్లి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ తాను చేసిన సేవలు, జగనన్న సంక్షేమ పాలన తనను సునాయసంగా గెలిపిస్తాయన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 33వ వార్డు మహిళా నేతలు కే హేమ, మంగ, పార్వతి, గైరమ్మ, రొంగలి శ్రీనివాసరావు, త్రినాథ్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ చేరిన జనసేన కార్యకర్తలు

మహారాణిపేట: జీవీఎంసీ 30 వార్డు జాలరిపేట నుంచి జనసేన కార్యకర్తలు సుమారు 100 మంది పైగా వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. ఆశీలమెట్ట కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు సురకల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం (కొండమ్మ), పార్టీ వార్డు ఇన్‌చార్జి పెంటపల్లి సత్యనారాయణ, పార్టీ నాయకులు దశమంతుల మాణిక్యాలరావు అధ్యక్షతన కార్యక్రమంలో జాలరిపేటకు చెందిన సుమారు వందమంది జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి వాసుపల్లి గణేష్ కుమార్ పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. 30వ వార్డు పార్టీ ఇన్‌చార్జీ పెంటపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వాసుపల్లిని గెలిపించి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి బహుమతిగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దశమంతుల చిన్ని, రాము, బాలు, జగన్ గోవింద్, రమేష్ పాల్గొన్నారు.

మత్స్యకారులంటే జగన్‌కు ఎంతో అభిమానం

- జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందాం
- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్
- ఫిషింగ్ హార్బర్‌లో విస్తృత ప్రచారం
- వెన్నంటే ఉంటామని గంగపుత్రుల హామీ



చేపలను పరిశీలిస్తున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బొత్స ఝాన్సీ, వాసుపల్లి గణేష్ కుమార్

మహారాణిపేట: జగనన్న ప్రభుత్వం మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకుందని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, వార్డు అధ్యక్షుడు పోతుస్వామి, మాజీ కార్పొరేటర్ చింతపల్లి పోతురాజు (పులి), మండల అధ్యక్షుడు గనగళ్ల రామరాజు, అశోక్ ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్ తదితర ప్రాంతాల్లో బొత్స ఝాన్సీ, వాసుపల్లి గణేష్ కుమార్ పర్యటించారు. మత్స్యకార మహిళలు, బోటు కలాసీలు, మత్స్యకార అసోసియేషన్ నాయకులతో భేటీ అయ్యారు. ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించారు. చేపల వ్యాపారులతో రోజువారి ఆదాయాన్ని అడిగి తెలుసుకున్నారు. వారి దగ్గర చేపలను కొనుగోలు చేసి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మీడియాతో మాట్లాడుతూ మత్స్యకారులకు ఎటువంటి కష్టం వచ్చినా తానున్నానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసాగా నిలిచిన ఎన్నో సంఘటనలను గుర్తు చేశారు. మత్స్యకారులంటే ముఖ్యమంత్రికి ఎంతో అభిమానమన్నారు. దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్‌పై ఇక్కడ ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు ఎల్లకాలం ఉండాలన్నారు. స్థానికుడైన వాసుపల్లికి ఓటు వేస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖ ఆడపడుచుగా, పార్లమెంట్ అభ్యర్థిగా తనను, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలోని ఫిషింగ్ హార్బర్ తనకు ఎంతో ఇష్టమైన ప్రాంతమని, ఈ ప్రాంతవాసులంతా తనను ఓ కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారన్నారు. నిరక్ష్యరాస్యులైన మా మత్స్యకారులకు తాను ప్రతినిధినన్నారు. మత్స్యకారుల సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించిన సంఘటనలు గుర్తు చేశారు.

మత్స్యకారులంటే చంద్రబాబుకు చిన్నచూపు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులను చంద్రబాబు ఎంతో చులకనగా చూసేవారని, తోలు తీస్తా, తాట తీస్తానని అవమానించారని వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. మత్స్యకారుల అభ్యున్నతి కోసం పార్లమెంట్‌లో మాట్లాడే మన మనిషి బొత్స ఝాన్సమ్మను నియోజకవర్గ మత్స్యకారులే కాకుండా జిల్లాలో ఉన్న మత్స్యకార కుటుంబాలన్నీ ఓటు వేసి గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ, పార్టీ నాయకులు డాక్టర్ జహీర్ అహ్మద్, మత్స్యకార సంఘాల నాయకులు ఆనంద్, గనగల్ల గరగయ్య, చిన్నారావు, చిన్న అప్పారావు, మసీన్, వాసుపల్లి ఎల్లారావు, నర్సింగరావు, బుజ్జి, కంబాల బొడ్డోడు, ఎం.ఆనంద్, కేఎఫ్ రాజు, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అనంతరం నష్టపరిహారం



బాధితురాలిని పరామర్శిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్, తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డులో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కారణంగా ఇల్లు, ఇంట్లో సామగ్రి దగ్ధమవడంతో బాధితురాలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్త తేజరత్నాన్ని వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్‌తో తోట పద్మావతితో కలిసి పరామర్శించారు. ఎన్నికల కోడ్ వల్ల తాము ఆర్థికంగా సహాయం అందజేయలేకపోతున్నామన్నారు. ఎన్నికల అనంతరం నష్టపరిహారం అందజేస్తామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వాసుపల్లి గణేష్‌కుమార్‌ను అఖండ మెజారిటీతో గెలిపించుకునే బాధ్యత వార్డు ప్రజలు, కార్యకర్తలపై ఉందని కార్పొరేటర్ పద్మావతి పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీనివాస్, లండా రమణ, గౌరీష్, దూడ అప్పారావు, వాసుపల్లి అప్పారావు, అనిల్, గోవింద్, చంటి పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ సేవలు ఎనలేనివని



రవీంద్రనాథ్ దంపతులను సత్కరిస్తున్న రవాణ శాఖ అధికారులు

జగదాంబ: డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జీఆర్ రవీంద్రనాథ్ సేవలు ఎనలేనివని రవాణ శాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ వడ్డీ సుందర్ అన్నారు. ఆదివారం రవీంద్రనాథ్ పదవీ విరమణ కార్యక్రమం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖ డీటీసీ రాజారత్నం, విజయవాడ డీటీసీ శివప్రసాద్ పాల్గొని మాట్లాడారు. అనంతరం రవీంద్రనాథ్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో సీహెచ్ శ్రీనివాస్, వి. జయప్రకాష్, గాజువాక ఆర్టీవో ఆదినారాయణ, రిటైర్డ్ ఆర్టీవో ఏహెచ్ ఖాన్, రఘుబాబు, ప్రసాద్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రవాణ శాఖ టెక్నికల్ అసోసియేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

6న బెస్ట్ స్మైల్ పోటీలు

తాటిచెట్లపాలెం: రైల్వేస్టేషన్ రోడ్డులోని రైల్వే క్రికెట్ స్టేడియంలో ఆదివారం వీ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 6న నిర్వహించనున్న బెస్ట్ స్మైల్ పోటీల పోస్టర్‌ను వివిధ రంగాలకు చెందిన కళాకారులు, క్రీడాకారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ పోటీల వివరాలను వెల్లడించారు. దంతాల సంరక్షణపై అన్ని వయసుల వారికి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 'విజయ దరహాసం' పేరుతో నవ్వుల పోటీలకు శ్రీకారం చుట్టామన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఎవరైనా పాల్గొనవచ్చని చెప్పారు. చక్కగా నవ్వుతూ ఉన్న ఫొటోతో పాటు పేరు, వయసు, ప్రాంతం, ఫోన్ నంబర్‌ను ఈ నెల 3లోగా 91336 94124 నంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు. ఉత్తమ నవ్వుల చిత్రాలకు ఈ నెల 6న డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బెస్ట్ స్మైల్ అవార్డులను అందజేస్తామన్నారు. జర్నలిస్ట్ వి.వి.రమణమూర్తి, సత్గీత్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు గణేష్, హాస్యప్రియ కామెడీ క్లబ్ సెక్రటరీ ఇమంది ఈశ్వరరావు, చిన్నారెడ్డి, చిత్ర దర్శకులు యాద కుమార్ పాల్గొన్నారు.

సత్యంపై విశ్వాసానికి ప్రతీక ఈస్టర్



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న అగ్రపీఠాధిపతి రెవరెండ్ ఫాదర్ పొలిమేర జయరావ్

అల్లిపురం: ఈస్టర్ వేడుకలు పురస్కరించుకుని నియోజకవర్గంలో అల్లిపురం మెయిన్‌రోడ్డు, కల్వరి బాప్టిస్ట్ చర్చి, ఆంథోనినగర్‌లోని సెయింట్ ఆంథోని చర్చి, జగదాంబ దరి లండన్ చర్చితో పాటు కొబ్బరితోట, చలువతోట ప్రాంతాల్లో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అల్లిపురం, సౌత్‌జైలురోడ్డులోని కల్వరి బాప్టిస్ట్ చర్చిలో జరిగిన ఆరాధనలో రెవరెండ్ కె.ఎడ్వర్డ్ విలియమ్స్ మాట్లాడుతూ క్రీస్తు పునరుద్థానపై ప్రసంగించారు. ఈ ప్రార్థనల్లో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు.

వేడుకల్లో ద్రోణంరాజు శ్రీవత్సవ్

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీ వత్సవ్ ఆదివారం ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్నారు. రామకృష్ణ జంక్షన్ దరి మున్సిపల్ కాలనీలో గల చర్చిలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో ఆయన పాల్గొని చర్చి పాస్టర్ నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ మెంబర్ లింగం శ్రీనివాస్, గాలి పార్వతి, పాస్టర్ అనిల్, జ్యోతి పాల్గొన్నారు.

జ్ఞానాపురం రక్షణగిరిలో..

కంచరపాలెం: ఏసుక్రీస్తు పునరుత్థాన పర్వదినం ఈస్టర్ (పాస్కా)ను జ్ఞానాపురం రక్షణగిరిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారని విశాఖ అపొస్తలిక్ పాలనాధికారి, విశాఖ అతిమేత్రాసనం అగ్రపీఠాధిపతి రెవరెండ్ ఫాదర్ పొలిమేర జయరావ్ అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ రక్షణగిరిలో పునీత పేతురు రాయప్ప దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో జాగరణ, దివ్యపూజా బలులు, ప్రార్థనలు నిర్వహించారు. మృత్యుంజయుడైన క్రీస్తును సెయింట్ పీటర్స్ ప్రధాన దేవాలయానికి తీసుకువచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ దివ్యపూజా బలులు సమర్పించారు. గురువులు ఫాదర్ వేళంగిణి రాజు, ఫాదర్ ప్రభాకర్ ప్రత్యేక ప్రార్థనల్లో పరిశుద్ధ జలమును అభిషేకించారు. ఏసుక్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచే ఘటనను చూపిస్తూ ప్రదర్శించిన భారీ సెట్ అందరినీ ముగ్ధులను చేసింది. కార్యక్రమంలో పీపీసీ అధ్యక్షుడు ముసిరి రాజేష్‌బాబు, సభ్యులు పాలమరశెట్టి ఫ్రాన్సిస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కల్వరి బాప్టిస్ట్ చర్చిలో ప్రసంగిస్తున్న రెవరెండ్ ఎడ్వర్డ్ విలియమ్స్



ద్రోణంరాజు శ్రీవత్సవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాస్టర్ అనిల్ తదితరులు

ప్రతిపక్షాలంటే బీజేపీకి కక్ష

సీతమ్మధార : ప్రతిపక్ష పార్టీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. ఆమ్ ఆద్మీ, సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ల అంశం బయటకు రాగానే దాని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు కేజ్రీవాల్‌ని అరెస్ట్ చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజ్, ఆప్ నేతలు రమేష్, డాక్టర్ సీతాల్, కాంగ్రెస్ నేత సుధాకర్,సీపీఎం నేత కృష్ణారావు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ ఆశీలు కాంట్రాక్ట్ రద్దు

జగదాంబ: పూర్ణామార్కెట్ ఆశీల కాంట్రాక్ట్‌ను సోమవారం నుంచి రద్దు చేస్తున్నామని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంబంధించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ పూర్ణామార్కెట్ పాట ఆశీల కాంట్రాక్ట్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. ఈఏడాది మార్చి 31తో గడువు తీరడంతో కాంట్రాక్ట్ రద్దు చేశామన్నారు. సోమవారం నుంచి పూర్ణామార్కెట్ ఆశీల వసూళ్లు తమ రెవెన్యూ సిబ్బంది, సెక్రెటరీలు చేస్తారని తెలిపారు.